# నా కోరికలు అట్టా తీర్చినారు!

'జామెట్రీ బాక్సులు తేనోళ్ళంతా యిళ్ళకు పదండీ' అన్నాడు మాల్యాద్రయివోరు – బ్లాక్‌బోర్డు కాడ చేతిలో చాక్‌పీస్ పట్టుకుని నిలబడి.

అదీ జామెట్రీ లెక్కల తొలి కిలాసు.

అప్పటికి నాలుగు రోజుల కిందే లెక్కల పిరీడులో... యిట్టా జామెట్రీ లెక్కలు రాబోతా వున్నాయి, అందరూ తలా ఒక జామెట్రీ బాక్సు తెచ్చుకోవాలి అని ఎచ్చరిక జారీ చేసి ఉన్నాడు మాల్యాద్రయివోరు. ఆయన ఆ మాట చెప్పిన రెండు మూడు రోజుల్లోనే అందరి దెగ్గిరా 'కేమెలు', 'నటరాజా' జామెట్రీ బాక్సులూ ప్రత్యక్షమయిపోయినాయి.సగం మంది కొత్తయి కొనుక్కుంటే మిగిలినోళ్ళు వాళ్ళ అన్నయ్యలవో, అక్కయ్యలవో తెచ్చుకున్నారు. యిట్టా కొత్తయ్యి కొనుక్కోలాకా... అన్నయ్యల కాణ్ణుంచి అక్కల కాణ్ణుంచి అరువు తెచ్చుకోలాకా ఉత్త చేతులతో మిగిలిపోయ్యింది యిద్దరమే యిద్దరం.

ఒకడు: పోలేపల్లి కిషన్ కిషోర్ గాడు. రెండోవాణ్ణి నేనూ.

మేమిద్దరం ఒకరినొకరం యీ సంగతి కనిపెట్టుకొని...పక్కనోడి జామెట్రీ బాక్సులతో అడ్జస్టయిపోదామని అనుకున్నాముగానీ సైతాన్ మాదర్చోదయిన మాల్యాద్రయివోరు మమ్మల్ని నేరుగా యిళ్ళకే పంపించేసే ప్రోగ్రాము పెడతాడనుకోలా.

'ఏంది?... జామెట్రీ బాక్సు తేనోళ్ళు లేస్తారా...లేవరా?' అని మళ్ళా అడిగినాడు మాల్యాద్రయివోరు.

యింక తప్పదని చెప్పి బితుకు బితుకుమంటానే కిషోరుగాడూ, నేనూ లేచినాం.

మాల్యాద్రయివోరు మా తట్టు అట్టా కళ్ళు తిప్పి చూసినాడు. ఆయన్తోపాటు కిలాస్‌లోని మొగపిలకాయలు ఆడపిలకాయలంతా ఒకలాంటి మొకాలతో మాతట్టు తిరిగినారు.

'ఏమిరా సాయిబూ...ఎందుకు కొనుక్కోలా?'అన్నాడు మాల్యాద్రయివోరు నాతో.

'ఎన్ని మార్లడిగినా మా నాయిన కొనివ్వలేదు సార్' అని చెప్పి మా నాయిన పరువు తీసిపడెయ్యడం యిష్టం లాక 'మా నాయిన ఊళ్ళో లేదు సార్' అని చెప్పినాను.


'ఎందుకు లేదు సార్' అన్నాడు మాల్యాద్రయివోరు.

'కరెంటు సామాన్లు తేవడానికి మద్రాసు పోయినాడు సార్' అనినాను.

'అయితే మీ నాయిన వచ్చేంతదాకా యింట్లోనే ఉండి, జామెట్రీ బాక్సు కొనుక్కున్నాకనే కిలాసుకు రాబో' అన్నాడు మాల్యాద్రయివోరు.

నాకు బలే బాదయిపోయింది... నన్ను యింటికి పంపిస్తున్నందుకు కాదు... నాతో పాటు కిషోర్ గాణ్ణి కూడా ఇంటికి పంపించబోతున్నందుకు. ఎందుకంటే అంతకు నెల కిందటే పాపం కిషోర్ వాళ్ళ నాయిన ఉన్నట్టుండి చనిపోయినాడు. మేమందరం చిన్నపిలకాయలమే అయినా వాళ్ళింటికాడికి పోయి ఆరోజు చాలాసేపు కిషోరు కాణ్ణే ఉండినాము. అప్పట్నుంచి మా కిలాసులోని వాళ్ళమంతా కిషోర్ మనసుకు ఎటువంటి కష్టమూ రానీకూడదని అనుకున్నాము. ముక్యంగా నేను. ఎందుకంటే వాడూ నేనూ బాగా క్లోజు.

అందుకనే మాల్యాద్రయివోరితో 'సార్...సార్...రేపు తెచ్చుకుంటాము సార్ జామెట్రీ బాక్సు. కిషోరు కూడా రేపు తెచ్చుకుంటాడంట సారో' అని బతిమిలాడినాను.




'కుదరదు సార్ – ముందు పుస్తకాలు తీసుకుని కదులు సార్' అన్నాడాయన చాక్‌పీసు అవతల పారేసి బెత్తం అందుకుంటా.

ఆయన చేతిలో బెత్తాం చూసేసరికి – ఏమీ అడక్కముందే బెదురుకునేసి...'సార్...మా అమ్మా'... అని ఏందో చెప్పబోయినాడు కిషోరు గాడు.

'నిన్ను అడిగినానా? నువు కూచో' అని...'సారా.... ఇంటికి పా' అన్నాడు మాల్యాద్రయివోరు.

కిషోరు గాణ్ణి కూచోబెట్టినాడు కదా అంతే చాలు అనుకుని గమ్మున పుస్తకాలు తీసుకుని యింటికి కదిలినాను నేను.

యిట్టా యింటికి కదలడం నాకేమీ కొత్త కాదు. దర్మాత్ముడయిన మా నాయిన పుణ్యమా అని మూడు నెలలకు ఒక మారన్నా ఇస్కూల్లో సగం మంచి ఇంటికి పంపించేసేవాళ్ళు నన్ను.

ఎందుకురా అంటే.. నా ఇస్కూలు ఫీజు నెలకు పది రూపాయిలు. ఆ పది రూపాయల సంబడాన్ని మా నాయిన టయానికి కట్టేవోడు కాదు. కరీం సాయిబు కొడుకు కదా అని యింకో నెల చూసేవాళ్ళు. అప్పటికీ కట్టేవాడు కాదు మా నాయిన. మూడోనెల యీ మాదిరిగా యింటికి పంపించేస్తే మరునటి రోజుకు యాణ్ణో ఒక దిక్కడ తెచ్చి కట్టేవాడు.

నిజ్జానికి మా నాయిన లాంటి తీరూ తెన్నూ లేని నాయిన మా కిలాస్‌లో యికొకరికి ఉంటాడని నేననుకోను. ఆయన నన్ను కని యిడిచినాడు గానీ ఏనాడూ నా ముక్యమైన కోర్కెలను పట్టించుకోలేదు.

నా ముక్యమైన కోర్కెలు: ఒకటి: పుస్తకాలు పెట్టుకొనిపోయేదానికి మంచి ఇస్కూలు బాక్సు కొనిపెట్టడం. (స్టీలుది గాకపోతే అల్యూమినియం ఐనా పర్వాలేదు.)

రెండు: రెండు డబ్బాల చిన్న టిపిను క్యారేజీ. ఇది తప్పని సరిగా స్టీలుదే అయి వుండాలి.

మూడు: ఇదిగో ఈ జామెట్రీ బాక్సు.

ఈ మూడు కోర్కెలు నెరవేర్చడానికి మా నాయినకాడ డబ్బులు లాక కాదు. ఒక్కరోజు ఆయన జేబీలో వంద రూపాయిల నోటు కూడా అవుపించేది. అది వున్న టయిములో అడిగినా కూడా 'కొందాములేరా. తొందరేమొచ్చిందనా' అనేసి ఆ డబ్బుల్ని యింకదేనికో కర్చుపెట్టేవాడు. నాకు మాత్రం నా కోరికలు తీరనందుకు కడుపు రగిలిపోతా వుండేది.

# దర్గామిట్ట కతలు

సూటుకేసులాగా అవుపించే మంచి ఇస్కూలు బాక్సు కొనుక్కొని, దానిలో ఒక తట్టు టెస్టు బుక్కులు... యింకో తట్టు నోటు బుక్కులు పెట్టుకుని... వడిమద్యనొచ్చే గ్యాపులో ఒక పెన్నూ, ఒక పెన్సిలూ, సెంటు వాసనొచ్చే ఒక లబ్బరు పెట్టుకొని... ఆ బాక్సును లాట్ గవర్నర్ అమ్మామొగుడి తీరులో ఇస్కూలుకు తీసకపోవాలని నాకెంత కోరికో. కానీ అంత ప్రాప్తం ఎక్కడిది నాయినా? మా అమ్మ యాణ్ణుంచోవెళ్లి మోచేతికి ఏలాడేసుకునే పసువచ్చని గుడ్డ సంచి తెచ్చిచ్చి 'ఇది చాల్లే నాయినా... స్టీలు బాక్సు బూలు బాక్సు ఎందుకా?' అని నన్ను ఫుసలాయించింది. ( ఆ పసుప్పచ్చటి గుడ్డ సంచిలో పుస్తకాలు పెట్టుకుని పోవడం కంటే నామార్దా పని యింకోటి వుండదు. పైగా దాని మీద ఎవురిదో బట్టతలాయన బొమ్మ, ఎరుపు రంగులో అరవ అక్షరాలు వుండేవి. దాన్ని బుజానికి తగిలించుకునేదానికి కూడాలా. చేత్తో పట్టుకుని పోవాల్సిందే కర్మ.)

సరే అదట్లా పోనీండి. బిడ్డ అడిగినాడుకదా అని స్టీలు క్యారేజయినా కొనీబళ్ళా? మా కిలాస్‌లో సగానికి సగం మంది పిలకాయలు నైసుగా ఉండే రెండు డబ్బాల స్టీలు క్యారేజీల్లో అన్నం తెచ్చుకునే వాళ్ళు. ఆ క్యారేజీల స్టాండ్లు బలే అందంగా ఉండి, డబ్బాలు బిగించి పెట్టేదానికి పైనొక బటనూ, హుక్కూ కలిగి ఉండేవి.

'నాగ్గూడా అట్లాంటి స్టీలు క్యారేజీ కొనీమా. బాగుంటుంది మా' అని మా అమ్మను బతిమిలాడుకుంటే బతిమిలాడుకుంటే ఒకరోజు, నామీద దయతో, రైల్వే రోడ్డులోని స్టీలు సామాన్ల అంగడికి పోయి మూడు గిన్నెల అల్యూమినియం క్యారేజీ కొనక్కొచ్చింది.

'స్టీలుదెందుకురా బచ్చే... డబ్బు జాస్తి. అన్నం తక్కువ. దీంట్లో అయితే హాయిగా రెండు డబ్బాల్లో అన్నం, ఒక డబ్బాలో కూర పెట్టుకుని పోవచ్చు' అని మళ్లా ఆడ కూడా సర్ది చెప్పింది నాకు.

అయితే రెండు రోజుల్లోనే ఆ క్యారేజీ బండారం బయటపడిపోయింది. దాని రివిట్ లూజు. మాటి మాటికీ జారిపోయి డబ్బాలు కింద పడిపోయేవి. దాంతో రోజూ క్యారేజీ కట్టినాక, డబ్బాలు జారిపోకుండా, పర్రుమని పాతగుడ్డ చించడం... స్టాండు పైన బిర్రుగా బిగించి కట్టడం..యిదే పని మా అమ్మకు.

ఆ రెండు కోరికలకూ అట్లాంటి గతి పట్టించినారు గదా జామెట్రీ బాక్సు కోరికను కూడా ఏగతి పట్టిస్తారో చూద్దామని యింటికి చేరుకున్నాను. మా నాయిన ఇంట్లోనే ఉన్నాడు.

'ఏమిరో వచ్చేసినావో' అన్నాడు నన్ను చూస్తానే.

'జామెట్రీ బాక్సు తేలేదని మాల్యాద్రయివోరు పంపించేసినాడు' అనినాను.

'పంపించేసినాడా? నువ్వు వచ్చేసినావా?' అంది మా అమ్మ.

ఆ మాటకు పాళ్ళు కొరకతా సంపకతినేలా చూశాను మా అమ్మ తట్టు.

'బిడ్డ మూడ్రోజుల నుంచి చెప్తానే ఉన్నాడు... బాక్కో బాక్సో అని. అదేదో తెచ్చి పెట్టుండొచ్చుగదా నాయినా' అంది మా నాయినమ్మ – మా నాన్నతో.

'నేను తేనని చెప్పానంటమ్మే. డబ్బులుండ బళ్ళా. అయినారే... జామెట్రీ లెక్కలకి స్కేలూ, పెన్సిలూ చాలవా నీకా?' అన్నాడు మా నాయిన.

'చాలవు. వృత్తలేకిని కూడా కావలంట' అన్నాను.

'మన్‌సూర్‌గాడి దెగ్గిర లేదా? వాడికి కొనిచ్చినట్టున్నానే' అన్నాడు మా నాయిన పెద్ద ఆలోచించేవోడి మాదిరిగా. (మా అన్న టయిము బాగుండి

**యిట్లా యింటికి కదలడం మనకేమీ కొత్తగాదు. దర్మాత్ముడయిన మా నాయిన పుణ్యమా అని మూడు నెలలకు ఒకమారన్నా ఇస్కూల్లో సగం నుంచి ఇంటికి పంపించేసే వాళ్ళు నన్ను.**

ఆ మాటలు యినలేదు. యినుంటే ఆచ్చర్యంతో చచ్చుండేవాడే)

'వాడికెవ్వడు కొనిచ్చినావు? వాడిక్కూడా లేదు జామెట్రీ బాక్సు' అన్నాను కోపంగా.

'కానీలేదా? సర్లే. రేపో మాపో నువు కొనుక్కుందూ గానీ ముందు పని జరిగేటట్టు చూడు' అని మహరాజల్లే నూక్కోబడి పోయినాడు మా నాయిన.

నేను ఏడస్తా కూచున్నాను మూల.

'ఏడవబాకరా నాయినా. ఇద్దో ఈ రూపాయి తీసకుని స్కేలన్నా తెచ్చుకోపో' అంది మా నాయినమ్మ.

'తెచ్చుకోపోరా. ఈలోవు మన యీదిలో ఎవురిదెగ్గిరన్నా ఆ వృత్తలేకినో గిత్తలేకినో దొరుకుతుందేమో అడగతాను' అని దయ చూపింది మా అమ్మ.

కానీ నాకు తెలుసు. మా యీదిలో యాడా జామెట్రీ బాక్సు దొరకదని. రెండ్రోజులుగా నేను యింటింటినీ గాలించేసినా ఒక నా కొడుకు దెగ్గిరా జామెట్రీ బాక్సు లేదు.

'సరే కానీ హరామ్ నాయలీదానా! నా బాద నీకే తెలుస్తుంది' అని మా అమ్మ మానానికి మా అమ్మనొదిలేసి రూపాయి తీసుకుని బజారుకి పోయినాను.

ఆ రూపాయితో ముప్పయి సెంటీమీటర్ల పొడుగు చెక్క స్కేలు తెచ్చుకునేసరికి మా అమ్మ యాణ్ణుంచో చిలుము పట్టిన వృత్తలేకిని తెచ్చిపెట్టుంది.

'యిద్దోరా. యింకేమి. జల్సా' అంది దాన్ని నా చేతిలో పెడతా.

'పోరా నాయినా. యింక నీ బాద తీరినట్టే' అని నవ్వింది మా నాయినమ్మ.

మరుసటిరోజు మళ్ళీ లెక్కల పిరిడు వచ్చింది. మాల్యాద్రయివోరు వచ్చి నన్ను చూస్తానే 'ఏమి సాయిబూ? తెచ్చుకున్నా?' అనినాడు.

'తెచ్చుకున్నా సార్' అన్నాను దయిర్యంగా.

'వెరీ గుడ్' అని బోర్డు వైపు తిరగబోతా, దేనికో అనుమానం వచ్చి 'ఏదీ..చూపీ' అన్నాడు.

నేను వెంటనే లేచినిలబడి గుప్పిట్లో పొడుగు స్కేలు, వృత్తలేకిని, పెన్సిలు పట్టుకుని చూపించినాను.

మాల్యాద్రయివోరు కళ్ళు పెద్దవి చేసి చూసినాడు వాటివైపు.

'అయిసరే... బాక్సు ఏదిరా?' అన్నాడు.

'బాక్సి బద్దేసు సార్. ఇవి చాలుగదా సార్!' అన్నాను.

ఆ మాటలకు మాల్యాద్రయివోరు సక్కా కదిలి నాకాడికి వచ్చినాడు.

'ఇవి చాలా?' అన్నాడు, నా చేతిలోని చిలుము వృత్తలేకినిని చూస్తా.

'చాలు గద సార్!' అన్నాను... యీసారి బయం బయంగా, బుగ్గలకు చేతులు అడ్డం పెట్టుకుంటా.

'అయితే కోణమానిని లాకుండా లంబరేఖ ఎట్లా గీస్తావో గియ్యి' అన్నాడు.

నేను బిత్తర చూపులు చూసినాను (ఎందుకంటే అది లాకుండా లంబరేఖ గీయలేము).

అప్పుడు నాయినా...

చాక్‌పీసు అవతల పారేసి...

నా బిత్తర చూపులు తీరేంతదాకా అమ్మా నాయినా అవుపించేదాకా...మాల్యాద్రయివోరు తన్ని నాడు చూడూ.. .

ఒళ్ళు వులిబొంగరం అయిపోయింది సామీ! ★

(యింత నాయింపుడు కార్యక్రమం జరిగినాకైనా నేను జామెట్రీ బాక్సు కొనుక్కున్నాననా? అట్లాంటిదే మీలా. 'కొందాము... కొందాము' అంటానే ఉండే మా నాయిన తాత్సారం పుణ్యమా అని జామెట్రీ బాక్సు లాకుండానే పదోకిలాసేగాదు నా చదువునే గట్టెక్కేసినాను నేను)

–మహమ్మద్ ఖదీర్‌బాబు